క్లుప్తంగా

మంత్రికి గులాబీ శ్రేణుల శుభాకాంక్షలు



మంత్రి మహేందర్‌రెడ్డితో బీఆర్‌ఎస్ నాయకులు

యాలాల: మంత్రి పట్నం మహేందర్‌రెడ్డిని శనివారం బీఆర్‌ఎస్ ముద్దాయిపేట నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇందులో సర్పంచ్ కృష్ణయ్యగౌడ్, ఎంపీటీసీ దేవగారి రాములు, మాజీ సర్పంచ్‌లు బిచ్చన్నగౌడ్, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్, నాయకులు ఆసిఫ్ హుస్సేన్, గోపాల్, రాంచంద్రయ్యగౌడ్, రమేష్‌గౌడ్, పంతుల శేఖర్, నరేందర్‌గౌడ్ ఉన్నారు.

గొర్రెలకు దాణా పంపిణీ



దాణా పంపిణీ చేస్తున్న చేస్తున్న డాక్టర్ వెంకటపతిరాజు

పెద్దేముల్: రెండో విడతలో మంజూరైన 24 గొర్రెల యూనిట్లకు శనివారం స్థానిక పశువైద్యశాలలో డాక్టర్ వెంకటపతిరాజు లబ్ధిదారులకు దాణా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దాణా పక్కదారి పడకుండా చూడాలన్నారు. తొలి విడతలో 404 యూనిట్లు పంపిణీ కాగా.. ప్రస్తుతం 24 యూనిట్లకు పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలో మిగతా యూనిట్లను అందజేస్తామని వెల్లడించారు.

ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న చంద్రప్ప

కొడంగల్ రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చంద్రప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఏఎన్‌ఎంలు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. సమానపనికి సమానవేతనం చెల్లించాలని, కనీస వేతనం చెల్లిస్తూ రెగ్యులర్ చేయాలని కోరారు. 20 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఏఎన్‌ఎంలు నిరసన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వారి సేవలను గుర్తించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం సభ్యులు అనురాధ, అనంతలక్ష్మి, సులోచన, రాములమ్మ, అనిత, జయమాల, తిరుపతమ్మ, శైలజ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతగిరి: 33/11 కేవీ వికారాబాద్ పట్టణ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని వికారాబాద్ డీఈ సంజీవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వికారాబాద్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు



బస్టాండ్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు

అనంతగిరి: వికారాబాద్‌లోని పలు ప్రాంతాల్లో జిల్లా డాగ్‌స్క్వాడ్ టీం, బీ.డీ టీంలు సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం వికారాబాద్ బస్టాండ్, రైల్వే స్టేషన్, మార్కెట్, జన సంచార ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు రెగ్యులర్ తనిఖీల్లో భాగంగా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, అనుమానాస్పద వస్తువులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులెవరైనా ఉన్నారా అని ఆరా తీశారు.

పంట నష్టం వివరాలను నివేదిస్తాం

షాద్‌నగర్: గ్రామాల్లో వేసిన చాలా పంటలు ఎండిపోయాయని, పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ తెలిపారు. శనివారం చౌలపల్లి, పీర్లగూడ గ్రామాల్లో వ్యవసాయ అధికారులు పర్యటించారు.

చౌక దుకాణం నామమాత్రం!

- సబ్సిడీ సరుకులకు మంగళం
- పప్పు, ఉప్పు, నూనెకు ఎసరు
- పెరిగిన ధరలతో పేదల అవస్థలు
- బియ్యంతో సరిపెడుతున్న సర్కారు

రేషన్ షాపు ద్వారా ప్రభుత్వం నిరుపేదలకు సరఫరా చేసే సబ్సిడీ సరుకులకు స్వస్తి పలికి.. కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది. రేషన్‌తో పాటు వంటకు కావాల్సిన నూనె, చింతపండు, కారంపొడి తదితర నిత్యవసర సరుకులకు మంగళం పాడి.. నామ మాత్రంగా చౌక ధరల దుకాణాలను కొనసాగిస్తోంది.



లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

దోమ: దోమ మండలం పరిధి 36 గ్రామ పంచాయతీల్లో 34 చౌక ధరల దుకాణాలు ఉండగా.. వాటి కింద 13,115 రేషన్ కార్డులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో అమ్మహస్తం పథకంలో భాగంగా బియ్యం, కిరోసిన్, నూనె, చింతపండు, పప్పులు, గోధుమలు, పంచదార, ఉప్పు, పసుపు, కారంపొడి వంటి తొమ్మిది రకాల సరుకులను రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తుండేది. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది. ఆహార భద్రత అమలులోకి వచ్చిన నాటి నుంచి కుటుంబంలో ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున చౌక బియ్యం అందజేస్తోంది. దీని ద్వారా రేషన్ బియ్యం కోటాను పెంచి, సామాన్యులకు కొంత ఆర్థికభారం నుంచి ఊరట కల్పించినప్పటికీ.. నిత్యవసర వస్తువుల కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో నిరుపేదలకు మార్కెట్ ధర వెచ్చించి పచారికొట్టులో విక్రయించటం కష్టతరంగా మారింది.

మిగతా సరుకులు అందించాలి



రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అన్ని సరుకులను పంపిణీ చేయాలి. బియ్యం కోటాను పెంచి ఉన్న సరుకులను తీసివేయడం సరి కాదు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అన్ని రకాల నిత్యవసర సరుకులను రాయితీ ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

– బంటు పద్మమ్మ, బొంపల్లి

కొనలేని పరిస్థితి



గతంలో తొమ్మిది రకాల సరుకులను పంపిణీ చేస్తే.. ఇప్పుడు ఒక బియ్యం మాత్రమే ఇస్తున్నారు. ఇతర నిత్యావసర సరుకులు బయట మార్కెట్‌లో కొనాలంటే ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వం బియ్యంతో పాటు నూనె, చింతపండు, పప్పులు, గోధుమలు, పంచధార, ఉప్పు, పసుపు, కారంపొడి వంటి సరుకులను ఇచ్చేలా చూడాలి.

– పోరల అనంతయ్య, మోత్కుర్

రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?

అడుగుతీసి అడుగు వేయటం కష్టమే

బంట్వారం: మట్టి రోడ్డుతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బంట్వారం మండలం మద్వాపూర్ గ్రామం నుంచి కోట్‌పల్లికి వెళ్లే మట్టి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి కాలినడకకూ కష్టంగా మారింది. పంచాయతీరాజ్ పరిధలోని ఈ రహదారి సుమారు 4 కిలో మీటర్లు ఉంటుంది. లింకు రోడ్డు కావడంతో వాహనదారులు ఎక్కువగా ఈ మార్గం గుండానే పయనిస్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరంబారం అవుతుందని మద్వాపూర్ వాసులు కోట్‌పల్లికి నిత్యం ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వానాకాలం కావడంతో ద్విచక్ర వాహనాలు కాదుకదా.. కనీసం కాలినడకన వెళ్లలేని దుస్థితి. ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరుగుతుండటంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే వెళ్తుంటారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై పీఆర్ డీఈ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా.. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.



మద్వాపూర్.. కోట్‌పల్లి రోడ్డు దుస్థితి

జాడలేని వాన చినుకు..



దౌల్తాబాద్ శివారులో ఎండిన కందిచేను

- ఎండుతున్న పంటలు
- ఆకాశంవైపు చూస్తున్న రైతులు
- వర్షాధారంపైనే మండలంలో 70శాతం సాగు

దౌల్తాబాద్: చినుకు జాడ కానరాక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులకు నీరు లేకపోవటం, దానికి తోడు ఎండలు మండుతుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. కళ్ల ముందే మాడుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. బోరు, నీటి పారకం ఉన్నవారు పంటలకు తడి అందిస్తుండగా.. వర్షంపై ఆధారపడి సాగు చేసిన వారికి కంటి మీద కునుకు లేకుండాపోయింది. ఏమి చేయాలో పాలుపోక ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. మండలంలో వర్షాధారం పైనే సుమారు 70శాతం రైతులు పంటలు పండిస్తున్నారు. ఈ సారి మండలంలో కంది 8,500 ఎకరాలు, పత్తి 13,000 ఎకరాలు, వరి 6,400 ఎకరాలు, పెసర్లు 300 ఎకరాల్లో పంటలు సాగు సాగుచేస్తున్నారు. అయితే వర్షాలు సరిగా లేనందున సాగు తక్కువగా నమోదైంది. గతేడాది ఈ సమయానికి మూడు ఫీట్ల వరకు ఎదిగిన పత్తి, ఈ సారి చినుకు లేకపోవడంతో కనుచూపుమేర ఎక్కడ చూసినా మొక్కలన్ని మోడు బారిపోయి దర్శనమిస్తున్నాయి.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

జూనియర్ న్యాయమూర్తి శివలీల

యాలాల: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని, లేని పక్షంలో లీగల్ సర్వీసు కమిటీ ఆధ్వర్యంలో కఠిన చర్యలకు వెనకాడబోమని తాండూరు సివిల్ కోర్టు జూనియర్ న్యాయమూర్తి శివలీల హెచ్చరించారు. శనివారం మండల పరిధి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలతో పాటు తాండూరు పట్టణంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతిగృహాలను ఆమె తనిఖీ చేశారు. నిత్యవసరాలను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాగా ఈ సోదా సమయంలో ఎస్సీ బాలుర వసతి గృహంలో వార్డెన్, అటెండర్ అందుబాటులో లేకపోవడంతో న్యాయమూర్తి శివలీల ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ప్రతి దరఖాస్తును స్వీకరించాలి

- అర్హులందరూ ఓటుహక్కు పొందండి
- ఓటరు నమోదు కార్యక్రమంలో తహసీల్దార్లు

మోమిన్‌పేట: నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు వచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం మోమిన్‌పేట మండలం టేకులపల్లి, ఏన్కతలలో బీఎల్‌ఓ కేంద్రాలను ఆయన సందర్శించి మాట్లాడారు. అక్టోబర్ 1నాటికి 18సంవత్సరాలు నిండి, అర్హులై మిగిలి పోయిన వారిని గుర్తించాలని చెప్పారు. వారిని వచ్చే నెల 2,3 తేదీల్లో దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజు, కార్యదర్శులు మైపాల్‌రెడ్డి, వెంకటయ్యలు తదితరులు ఉన్నారు.



మోమిన్‌పేట: ఏన్కతలలో బీఎల్‌ఓ కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్



కుల్కచర్ల: స్థానికులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ప్రభులు

రాజ్యాంగం కల్పించిన హక్కు

కుల్కచర్ల: అర్హులందరూ ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు అన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా విఠలాపూర్‌లో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి పౌరుడు దానికి వినియోగించుకోవాలని సూచించారు. ఓటుహక్కు పొందేందుకు జీపీ కార్యదర్శి, లేదా అంగన్‌వాడీ కేంద్రాలు, తహసీల్ కార్యాలయంలో అర్జీ పెట్టుకోవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గిర్దవరి వెంకటగిరి, స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారి పేర్లను తొలగించాలి

తాండూరు రూరల్: 18 సంవత్సరాలు పూర్తి అయిన యువతీ, యువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని తాండూరు డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు అన్నారు ఓటరు నమోదు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను తొలగించడంతో పాటు.. కొత్త ఓటర్లను నమోదు చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 17 తేదీలోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.



దోమ: ఊటుపల్లిలో పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ పురుషోత్తం

తప్పులు సవరించాలి

దోమ: ఓటరు జాబితాలో ఏమైనా తప్పులుంటే బీఎల్‌ఓలు సవరించాలని తహసీల్దార్ పురుషోత్తం సూచించారు. మండల కేంద్రంతో పాటు బొంపల్లి, ఊటుపల్లి గ్రామాల్లో పోలింగ్ బూత్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. బీఎల్‌ఓలు ఓటరు నమోదులో నిర్లక్ష్యం వహించకుండా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్‌ఐ లింగం, సర్పంచులు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు ఉన్నారు.

బంట్వారంలో..

బంట్వారం: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. స్పెషల్ క్యాంపెయిన్‌లో భాగంగా బంట్వారం, తొర్మామిడి, బొప్పునారం గ్రామాలను ఆయన సందర్శించి మాట్లాడారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపెయిన్‌లో ఓటరు నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు, ఓటరు ఐడీ కార్డు పొందడం, ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వప్న, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: అర్హులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కిషన్ అన్నారు. పెద్దేముల్ మండలం ఇందూరు, తట్టెపల్లి, హన్మాపూర్, గొట్లపల్లి, నాగులపల్లితో పాటు పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఓటరు నమోదు కార్యక్రమం ఆదివారం సాయంత్రం వరకు పూర్తి చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్‌ఐ) రాజిరెడ్డి ఉన్నారు.

పరిగిలో భారీగా ట్రాఫిక్ జామ్



రహదారి పొడవునా నిలిచి పోయిన వాహనాలు

పరిగి: చేవెళ్ల ప్రజా గర్జన సభ సందర్భంగా శనివారం పరిగిలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సభ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి తోడు కొడంగల్ నియోజకవర్గ నాయకుల వాహనాల ర్యాలీ, స్థానికంగా సంతకు వచ్చే వాహనాలు ఒకే సారి రోడ్డు ఎక్కడంతో వందల కొద్ది వాహనాలు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పట్టణ కేంద్రంలోని బీఎస్‌ఎన్‌ఎల్ భవనం నుంచి కొడంగల్ రోడ్డు వరకు వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రాకపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు.

'దళితబంధు' కోసం ఆందోళన

ఎమ్మెల్యే హామీతో విరమణ

అనంతగిరి: అన్ని అర్హతలు ఉన్న తనకు దళితబంధు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే ఆనంద్ క్యాంపు కార్యాలయం ఎదుట శనివారం సర్పన్‌పల్లి గ్రామానికి చెందిన అనంతయ్య ఆందోళనకు దిగాడు. ఆ సమయంలో ఎమ్మెల్యే కార్యాలయంలో లేరు. దీంతో అక్కడున్న కొందరు నాయకులు అతన్ని సముదాయించి, ఎమ్మెల్యేను పిలిపించి మాట్లాడారు. దశలవారీగా అర్హులందరికీ దళితబంధు అందజేస్తామని హామీ ఇవ్వడంతో అనంతయ్య ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా సిద్దులూర్‌కు చెందిన పలువురు దళితబంధు ఇప్పించాలని కోరుతూ కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

పచ్చని చెట్లే జీవకోటికి ఆధారం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత
- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులు
- కోటి వృక్షార్చనలో మొక్కలు నాటిన సకల జనులు

'సమస్త జీవకోటికి పచ్చని చెట్లే జీవనాధారం. అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షించాలి. మొక్కల పెంపకంతో కాలుష్యం తగ్గి వర్షాలు సమృద్ధిగా కురిసేందుకు అవకాశం ఉంటుంది. అందరూ సామాజిక బాధ్యతగా భావించాలి' అని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు.



కొడంగల్: మొక్కలు నాటుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్

పెద్దేముల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీపీ అనురాధ అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా శనివారం పెద్దేముల్ మండలం నాగులపల్లి, పాషాపూర్, రుద్రారం, గొట్లపల్లి, రెగోండి తదితర గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆమె మొక్కలు నాటారు. అనంతరం పలువురు మాట్లాడారు. మండలంలో 30వేల మొక్కలు నాటుతామని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను కాపాడుకునేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారి లలితకుమారి, ఎంపీడీఓ లక్ష్మప్ప, సర్పంచ్‌లు భరత్, పద్మమ్మ, భాగ్యమ్మ, అటవీ శాఖ అధికారి మమత, ఉపాధి ఏపీఓ లక్ష్మీదేవి ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

దౌల్తాబాద్: నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా మండల కేంద్రంలోని ఫారెస్టు నర్సరీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. మానవమనుగడకు చెట్లు ఎంతో ముఖ్యమని, అందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టిందని పేర్కొన్నారు. ఇందులో జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ తిరుమలస్వామి, సర్పంచ్ శిరీష, ఎంపీఓ రవీందర్ ఉన్నారు.

ప్రాణవాయువు సమస్య ఉండదు

తాండూరు టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు పెంచడంతో జీవకోటికి భవిష్యత్‌లో ప్రాణవాయువు సమస్య ఉండదని పేర్కొన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా, పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, ఏఈ ఖాజ హుస్సేన్ ఉన్నారు.

మానవ మనుగడ కోసం..

మర్పల్లి: మానవ మనుగడ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీపీ బట్టు లలిత అన్నారు. కోటి వృక్షార్చనలో భాగంగా మండలం సిరిపూరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మండల ప్రత్యేకాధికారి ఈఓపీఆర్‌డీ అనిత, సర్పంచ్ మల్లయ్యతో కలిసి ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎక్కడైతే చెట్లు అధికంగా ఉంటాయో అక్కడ వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, దీంతో పంటలు సమృద్ధిగా కురుస్తాయని చెప్పారు. ఈఓపీఆర్‌డీ అనిత మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం ప్రకారం ప్రతి గ్రామంలో అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటించాలన్నారు. ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య, ఈఓపీఆర్‌డీ మహేశ్, ఏపీఓ అంజిరెడ్డి ఉన్నారు.



పెద్దేముల్: నాగులపల్లిల్లో మొక్కలు నాటుతున్న ఎంపీపీ అనురాధ



దౌల్తాబాద్: మొక్కలు నాటుతున్న ఎంపీపీ తదితరులు



తాండూరు టౌన్: పుర కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైస్ చైర్‌పర్సన్ దీప, సీఐ



మర్పల్లి: సిరిపురంలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, లలిత, ప్రత్యేక అధికారి అనిత, ఎంపీడీఓ